
సాక్షి
అనంతపురం
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



ముగిసిన కందుల కొనుగోళ్లు

జిల్లాలో కందుల కొనుగోలు ప్రక్రియ ముగిసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి తెలిపారు. 11,485 మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేసినట్లు వివరించారు.

గరిష్టం/కనిష్టం
41.3°/22.6°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఉన్నతాధికారుల పేరుతో నకిలీ ఖాతాలు

- అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ వినోద్‌కుమార్ సూచన



అనంతపురం అర్బన్: కలెక్టర్, ఇతర జిల్లా ఉన్నతాధికారుల పేర్లపై సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ ఖాతాలు సృష్టించారని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఆ ఖాతాలు, ఫోన్ ద్వారా డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇలాంటి వాటి పట్ల ఉద్యోగులు, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెసేజ్‌లు వస్తే సహ ఉద్యోగులైనా, తెలిసిన వారైనా నిర్ధారించుకోకుండా తొందరపడి డబ్బు పంపరాదన్నారు. వెంటనే పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

నేడు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్

అనంతపురం అర్బన్: కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం గురువారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్జీలను సమర్పించుకోవాలని సూచించారు.

తపాలా ఎస్పీగా రాజేష్

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ తపాలా సూపరింటెండెంట్‌గా రాజేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడప డివిజన్ రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్న ఆయనకు అనంతపురం డివిజన్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆయనకు తపాలా ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు బ్రహ్మానందరెడ్డి, కృష్ణయ్య యాదవ్ తదితరులు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇప్పటి వరకూ ఆ స్థానంలో కొనసాగిన గుంపస్వామి బుధవారం రాత్రి రిలీవ్ అయ్యారు. వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన ఆయనపై ఫిర్యాదులు వెల్లువెతిన నేపథ్యంలో తెలంగాణలోని హైదరాబాద్ సర్కిల్ పరిధిలోని ఆదిలాబాద్ డివిజన్‌కు ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



పెద్దవడుగూరులోని ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ రమణమూర్తి

పెద్దవడుగూరు: రైతులకు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులను గుంటూరు నుంచి వచ్చిన వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడీఏ రమణమూర్తి, గుత్తి ఏడీఏ వెంకట్రాముడు హెచ్చరించారు. పెద్దవడుగూరులోని ఉమామహేశ్వర ఫర్టిలైజర్ షాపును బుధవారం వారు ఆకస్మిక తనిఖీ చేశారు. విక్రయిస్తున్న విత్తనాలు, పురుగు మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. విక్రయించే ప్రతి విత్తనమూ నాణ్యతగా ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేస్తే సహించబోమని హెచ్చరించారు. పత్తి విత్తనాల కొనుగోలు సమయంలో రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని అక్కడి రైతులకు సూచించారు. రసీదు లేకుండా ఎవరైనా విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనరేట్ ఏఓ సుకుమార్, అనంతపురం జేడీఏ కార్యాలయ టీఏఓ రాకేష్‌నాయక్, ఏఓ మల్లీశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద వ్యక్తిగతంగా పరికరాలు అవసరమైన రైతులు ఆర్‌ఎస్‌కేల్లో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేటాయించిన రూ.3 కోట్ల బడ్జెట్‌లో ఇప్పటికే రూ.1.60 కోట్ల మేర అవసరమైన పరికరాలు కావాలని రైతులు తమ వాటా కింద సొమ్ము చెల్లించి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇంకా బడ్జెట్ ఉన్నందున సాధ్యమైనంత తొందరగా స్ప్రేయర్లు, టిల్లర్లు, తదితర వాటికి 50 శాతం మేర రైతు వాటా చెల్లించి దరఖాస్తు చేసుకుంటే పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు.

వీరి రూటే సపరేటు!



అనంతపురం అర్బన్, రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వసూళ్ల పర్వం

- ఒకేరోజులో డాక్యుమెంటు కావాలంటే ఒకరేటు
- సర్టిఫైడ్ కాపీ వాట్సాప్‌లో పంపేందుకు ఇంకో రేటు..
- ఇప్పటికే జీపీఏల ద్వారా రూ. కోట్ల విలువైన భూముల రిజిస్ట్రేషన్

- అనంతపురం నగరంలోని సిండికేట్‌నగర్‌లో వారం రోజుల క్రితం ఓ వ్యక్తి నాలుగు సెంట్ల స్థలం కొన్నారు. అదే రోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి స్థలానికి సంబంధించి డాక్యుమెంటు కావాలని అడిగితే మొదట ససేమిరా అన్నారు. సదరు వ్యక్తి రూ. 2 వేలు ఇచ్చేసరికి సాయంత్రానికే మహిళా సిబ్బంది డాక్యుమెంటు అందించారు.
- రాప్తాడు రూరల్ పరిధిలో రెండెకరాల వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్‌కు వచ్చింది. ఇటీవల భూమి కొనుగోలుదారుడు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లి డాక్యుమెంటు కావాలని కోరగా మొదట ఎవరూ స్పందించలేదు. తర్వాత కొంతసేపటికే ఆఫీసు సిబ్బంది అతడి దగ్గరికి వెళ్లి రూ.5 వేలు చెల్లిస్తే సాయంత్రానికి ఇస్తామని చెప్పారు. డబ్బు తీసుకుని చెప్పిన టైంకి అందించారు. మచ్చుకు ఇవి రెండు ఉదాహరణలే.. ఇలాంటివి అనంతపురం అర్బన్, రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిత్యం పదుల సంఖ్యలో జరుగుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం అర్బన్, రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వసూళ్ల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. సాధారణంగా భూమి రిజిస్ట్రేషన్ జరిగితే.. ఒరిజినల్ డాక్యుమెంటు అందుకునేందుకు వారం నుంచి 10 రోజులు పడుతుంది. కానీ రూ.1,000 కొడితే సాయంత్రానికే సిబ్బంది ఇచ్చేస్తున్నారు. డబ్బులివ్వకుంటే ఆలస్యం చేస్తున్నారు. ఈ నెల 8న భూముల రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఇప్పటికీ డాక్యుమెంట్ రాకపోవడమే ఇందుకు ఉదాహరణ. సిబ్బంది అక్రమ వ్యవహారంతో సామాన్యులు విసుగెత్తిపోతున్నారు. అన్ని విషయాలు ఆయా సబ్ రిజిస్ట్రార్‌లకు తెలిసే జరుగుతున్నట్టు సమాచారం.

నకళ్లకు వంద...

స్థిరాస్తులకు సంబంధించిన నకళ్లు (సర్టిఫైడ్ కాపీలు) కావాలంటే రూ.500 చలానా చెల్లించి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రూ.150 చెల్లిస్తే డాక్యుమెంటు ఇస్తారు. కానీ కొంతమంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రూ. వంద తీసుకుని.. డాక్యుమెంటు నంబర్ ద్వారా వాట్సాప్‌లో పీడీఎఫ్ కాపీలు పంపిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి చలానాల రూపంలో అందే ఆదాయం పడిపోతోంది. ఇక.. పక్కాగా ఉన్న డాక్యుమెంటు రిజిస్ట్రేషన్‌కు అయినా సబ్ రిజిస్ట్రార్‌కు ముడుపులు చెల్లించాల్సి వస్తోందనే విమర్శలు ఉన్నాయి. లేదంటే 'కామా లేదు, ఫుల్‌స్టాప్ లేదు, దిశలు సరిగా లేవు' అని కొర్రీలు పెట్టి తిప్పుకుంటున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో అనంతపురం అర్బన్, రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాలంటేనే సామాన్యులు భయపడుతున్నారు. సబ్ రిజిస్ట్రార్‌లు ఏమీ తెలియనట్టే ఉంటూ కిందిస్థాయి సిబ్బంది ద్వారా పిండుకుంటున్నారు.

జీపీఏలు చూసి రిజిస్ట్రేషన్..

సామాన్యులకు ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించాక రిజిస్ట్రేషన్‌లు చేస్తున్న అనంతపురం రూరల్, అర్బన్ రిజిస్ట్రేషన్ అధికారులు.. ఇటీవల జీపీఏను చూపించినా భారీగా రిజిస్ట్రేషన్‌లు చేయడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. శోత్రియం భూములపై రాప్తాడుకు చెందిన కొంత మంది టీడీపీ నాయకులు జీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ)లు సృష్టించారు. వీటిని అడ్డు పెట్టుకుని సబ్ రిజిస్ట్రార్‌లు కోట్లాది రూపాయల విలువ చేసే భూములను 'పచ్చ' నేతల సొంతం చేశారు. ఈ క్రమంలో ఆయా భూములు కొన్న వారు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

మరో నాలుగు చోట్లా ఇంతే..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తీరు మారడం లేదు. ఎన్ని సంస్కరణలు తెచ్చినా వసూళ్లు మాత్రం ఆగడం లేదు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, తాడిపత్రి, రాయదుర్గం కార్యాలయాల్లోనూ పరిస్థితి అధ్వానంగా ఉంది. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌లకు వెళ్లిన వారికి ఆయా కార్యాలయాల సిబ్బంది చుక్కలు చూపిస్తున్నారు. ఏసీబీ దాడులు జరిగినా, విజిలెన్స్ సోదాలు నిర్వహించినా మూణ్నాళ్ల ముచ్చటే అవుతోంది.

కఠిన చర్యలు తీసుకుంటాం

గతంలో మాదిరి డాక్యుమెంట్లు ఎక్కువ రోజులు పట్టడం లేదు. అయినా డబ్బు తీసుకుని ఒక్క రోజులో ఇవ్వడం సరి కాదు. సర్టిఫైడ్ కాపీలు వాట్సాప్‌లో పంపడం నేరం. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

–భార్గవ్, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి

సీనియర్ సివిల్ జడ్జిల బదిలీ

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి బి. నిర్మలను శ్రీకాకుళం జిల్లా టెక్కలికి బదిలీ చేశారు. హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి మణిపాటి శ్రీధర్‌ను శ్రీకాకుళం ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా, ఆయన స్థానాన్ని మదనపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి. వెంకటేశ్వర్లు నాయక్‌కు కేటాయించారు. ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి ఎ.గీతావాణి నెల్లూరు జిల్లా కావలికి బదిలీ కాగా.. గుంటూరు జిల్లా రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి తమ్మినేని వెంకటేశ్వర్లుకు ధర్మవరానికి బదిలీ చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.పద్మను అనంతపురానికి బదిలీ చేశారు. అనంతపురం జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీగా పనిచేస్తున్న జి. శివప్రసాద్ యాదవ్‌ను అనంతపురం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. విజయవాడ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎస్.రాజశేఖర్.. అనంతపురం జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీగా బదిలీ అయ్యారు.

డబుల్ ఓట్ల తొలగింపునకు చర్యలు

అనంతపురం అర్బన్: రెండు ఓట్ల (డబుల్) తొలగింపు ప్రక్రియను జిల్లా ఎన్నికల యంత్రాంగం చేపట్టింది. డెమొగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్ సిస్టం ద్వారా జిల్లాలో రెండు ఓట్లు కలిగిన ఓటర్లను గుర్తించి ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. 'మీకున్న రెండు ఓట్లలో ఏ ప్రాంత ఓటును తొలగించాలి' అంటూ నోటీసులో పేర్కొన్నారు. ఓటరు తెలియజేసిన ఓటును ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం తొలగించనున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 3,317 డబుల్ ఓట్లను గుర్తించి నోటీసులు జారీ చేశారు. నిర్దేశించిన ఏడు రోజుల గడువు ముగిసిన తర్వాత వాటిని తొలగించారు.

వేరుశనగకు పంట రుణం రూ.38 వేలు

- 10 నుంచి 20 శాతం పెరిగిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్
- బ్యాంకుల్లో ప్రారంభమైన పంట రుణాల రెన్యువల్స్



అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది వేరుశనగ పంటకు సంబంధించి ఎకరాకు రూ.38 వేల ప్రకారం రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు ఆదేశాలు అందాయి. ఖరీఫ్, రబీలో పంటల వారీగా రైతులకు ఎంత మొత్తంలో రుణాలివ్వాలనే అంశంపై గరిష్ట రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారైనట్లు బ్యాంకర్లు తెలిపారు. గతేడాది కన్నా పంట పెట్టుబడులను బట్టి 10 నుంచి 20 శాతం రుణ పరిమితి పెంచారు. జిల్లాలోని బ్యాంకుల్లో రైతులకు సంబంధించి ఖరీఫ్ పంట రుణాల రెన్యువల్స్, కొత్త రుణాల పంపిణీ ప్రారంభమైనట్లు బ్యాంకర్లు చెబుతున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు అదనంగా 15 శాతం అధికంగా ఇచ్చే వెసులుబాటు కల్పించినట్లు సమాచారం.

పంటల వారీగా ఇలా:

వర్షాధారంగా సాగు చేసే వేరుశనగ ఎకరాకు రూ.38 వేలు, నీటి వసతి కింద అయితే రూ.41 వేల ప్రకారం రుణం ఇవ్వనున్నారు. కంది పంట వర్షాధారంగా ఎకరాకు రూ.29 వేలు, నీటి వసతి కింద రూ.30 వేలు, ఆముదం రూ.22 వేలు, పప్పుశనగ రూ.37 వేలు, పత్తి రూ.51 వేలు– 55 వేలు, విత్తనోత్పత్తి పత్తి రూ.1.60 లక్షలు, వరి రూ.52 వేలు, విత్తన వరి రూ.55 వేలు, జొన్న రూ.25 వేలు, రాగి రూ.22 వేలు– 25 వేలు, సజ్జ రూ.21 వేలు– 24 వేలు, కొర్ర రూ.17 వేలు– 21 వేలు, వర్షాధారంగా మొక్కజొన్న రూ.31 వేలు, నీటి వసతి కింద రూ.47 వేలు, విత్తన మొక్కజొన్నకు రూ.50 వేలుగా నిర్ణయించారు.

ఉద్యాన, కూరగాయల పంటలకు..

పచ్చిమిరపకు రూ.1.10 లక్షలు, ఎండుమిరప రూ.1.75 లక్షలు, టమాట ట్రెల్లీస్ లేకుండా రూ.41 వేలు, ట్రెల్లీస్ టమాట రూ.65 వేలు, హైబ్రీడ్ టమాట రూ.78 వేలు, ట్రెల్లీస్ హైబ్రీడ్ టమాట రూ.1.25 లక్షలు, వంకాయ రూ.54 వేలు, హైబ్రీడ్ వంకాయ రూ.67 వేలు, బెండ రూ.36 వేలు, హైబ్రీడ్ బెండ రూ.50 వేలు, ఉల్లి రూ.60 వేలు, మునగ రూ.49 వేలు, వర్షాధారంగా జీబీకార్న్‌కు రూ.28 వేలు, నీటి వసతి కింద రూ.44 వేలు, కరివేపాకు రూ.60 వేలు, ధనియాలు రూ.24 వేలు, సోయాబీన్స్ రూ.17 వేలు, అరటి ఎకరా రూ.1.10 లక్షలు, టిష్యూ కల్చర్ అరటి రూ.1.36 లక్షలు, దానిమ్మ రూ.1.60 లక్షలు, చీనీ రూ.71 వేలు, నిమ్మ రూ.85 వేలు, బొప్పాయి రూ.1.20 లక్షలు, మామిడి రూ.55 వేలు, సపోట రూ.43 వేలు, ద్రాక్ష రూ.1.25 లక్షలు, రేగు రూ.34 వేలు, కళింగర రూ.54 వేలు, దోస రూ.66 వేలు, జామ రూ.55 వేలు, అంజూర రూ.42 వేలు, సీతాఫలం రూ.27 వేలు, డ్రాగన్‌ఫ్రూట్ రూ.77 వేలు, చింత రూ.27 వేలు, కొబ్బరి రూ.70 వేలు, మల్లెపూల తోటల సాగుకు రూ. లక్ష, రోజాపూలు రూ.43 వేలు - 66 వేలు, బంతిపూలు రూ.55 వేలు, చామంతి రూ.60 వేలు, కనకాంబరాలు రూ.39 వేలు, గడ్డి సాగు రూ.36 వేలు, మల్బరీ సాగుకు రూ.1.20 లక్షల మేర స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేశారు.

1.20 కోట్ల పనిదినాలు..రూ.368 కోట్ల నిధులు

'ఉపాధి' ప్రణాళిక ఖరారు

- సగటు వేతనం రూ.307కు పెంపు
- జూన్ ఆఖరుకు 68 లక్షల పనిదినాలు పూర్తి చేసేలా కార్యాచరణ
- అక్రమాలు లేకుండా చర్యలు తీసుకోవాలంటున్న కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

రాయదుర్గం: ఉపాధి హామీ పథకం కింద పని దినాల లక్ష్యం ఖరారైంది. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.368 కోట్లతో 1.20 కోట్ల పని దినాలు కల్పించేలా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రణాళిక రూపొందించింది. ఈ క్రమంలో జూన్ ఆఖరుకు జిల్లాలోని 31 మండలాల్లో 68 లక్షల పని దినాలు పూర్తి చేసేలా ఉన్నతాధికారులు లక్ష్యం నిర్దేశించారు. ఒక్కో కూలీకి సగటు వేతనం రూ.307 చెల్లించేలా కార్యాచరణ చేపట్టారు. ఇంకుడు గుంతలు, పశువుల షెడ్లు, నర్సరీల్లో మొక్కల పెంపకం, చెక్‌డ్యాంలు, వ్యక్తిగత మరుగు దొడ్లు, పంట పొలాలకు అనుసంధానంగా రోడ్లు, నీటి కుంటల నిర్మాణాలు, మొక్కలు నాటడం లాంటి పనులకు పెద్దపీట వేయనున్నట్లు తెలిసింది.

దొంగ మస్టర్ల కలకలం..

కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధి నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా చోట్ల గత వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన పనుల వద్దే మళ్లీ తూతూమంత్రంగా పనులు చేస్తున్నారని, మరి కొన్నిచోట్ల వృథా పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల కొన్ని మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల దొంగ మస్టర్ల మాయాజాలం కలకలం రేపింది. కూలీలు పనులకు రాకున్నా హాజరు వేస్తూ డబ్బులు మింగేస్తున్న వైనం అందరినీ విస్మయానికి గురి చేసింది. జిల్లా సరిహద్దు మండలాల్లో అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇక.. కూటమి ప్రభుత్వంలో కొత్తగా పుట్టుకొచ్చిన శ్రమశక్తి సంఘాల ముసుగులో అర్హులకు అన్యాయం జరిగే అవకాశం లేకపోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో పనులను అధికారులు నిత్యం తనిఖీ చేయడంతో పాటు ప్రతి మస్టర్‌ను నిశితంగా పరిశీలించాకే వేతనాలు జమ చేయాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో వివరాలు

యాక్టివ్ జాబ్ కార్డులు	2.60 లక్షలు
నమోదైన కూలీల సంఖ్య	4.58 లక్షలు
మొత్తం శ్రమశక్తి సంఘాలు	13,164

అక్రమాలకు తావులేదు

ఉపాధి పథకంలో ఈ ఏడాది లక్ష్యం మేరకు పనులు కల్పిస్తాం. అడిగిన ప్రతి కూలీకి పని చూపుతాం. సగటు వేతనం రూ.307 పొందేలా అవగాహన కల్పిస్తున్నాం. గతేడాది 1.10 కోట్ల పని దినాలు ఉండగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో 1.20 కోట్లకు పెంచాం. మస్టర్లలో అవకతవకలు జరగకుండా పటిష్ట చర్యలు చేపడతాం. పనులకు రాకుండా వేతనాలు జమ చేసినట్లు తేలితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవు. – సలీమ్‌బాషా, డ్వామా పీడీ

చౌడేశ్వరీ.. నమోస్తుతే..

అమడగూరు: చల్లని తల్లి చౌడేశ్వరమ్మ జ్యోతుల వెలుగుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అమడగూరులో వెలసిన చౌడేశ్వరీ దేవి వార్షిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ధర్మకర్త, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పొట్టా పురుషోత్తమరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జ్యోతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జ్యోతి ఉత్సవంలో అమ్మవారిని దర్శించుకుంటే అంతా శుభమే జరుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, అమ్మవారిని మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

జ్యోతిదర్శనంతో పులకించిన భక్తజనం

ఉత్సవంలో భాగంగా తొలుత అమ్మవారి విగ్రహాన్ని పూల పల్లకీపై కొలువుదీర్చి ఆలయం నుంచి గ్రామ నడిబొడ్డున ఉన్న ఉట్టి వరకూ ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి పల్లకీ ముందు జ్యోతిని రగిలించారు. జ్యోతి ముందు వెళ్తుండగా... ఆ వెలుగుల్లో చౌడేశ్వరీదేవి భక్తులను దర్శనమిచ్చారు. ఈ క్రమంలో జ్యోతిని చూడటానికి భక్తులు పెద్ద ఎత్తున ఎగబడ్డారు. డప్పు, మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య యువకులు చిందులేస్తూ ఆడి, పాడారు. భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన కోలాటలు, భజనలు, హరికథలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చీకిరేవులపల్లి యూత్ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం అశ్వవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.



చౌడేశ్వరి దేవి పూల పల్లకి ఉత్సవం

గడువులోపు పరిష్కారం చూపాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్
- నక్కనదొడ్డి తండాలో పర్యటన



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుంతకల్లు: రెవెన్యూ పరమైన అంశాల్లో అర్జీదారులు ఇచ్చిన వినతులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ ఆదేశించారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై స్థానిక శ్రీశంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఆర్‌ఓ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. భూతగాదాలు, రస్తా సమస్యలు, ఇంటి స్థలాలు... తదితర సమస్యలు ఎంత మేరకు పరిష్కారం అయ్యాయంటూ అధికారులతో ఆరా తీశారు. రెవెన్యూ పరమైన భూసేకరణ, ఆర్‌ఓఆర్ సమస్యలు తదితర విషయాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, గుంతకల్లు ఆర్‌డీఓ శ్రీనివాస్, సర్వే ఏడీ రూప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నక్కనదొడ్డి తండాలో పర్యటించిన కలెక్టర్

గుంతకల్లు రూరల్: ఆర్‌ఓ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం గుంతకల్లుకు వచ్చిన కలెక్టర్ వినోద్‌కుమార్... అనంతరం ఇదే మండలంలోని నక్కనదొడ్డి తండాలో పర్యటించారు. గ్రామానికి చెందిన రైతు మునే నాయక్ సర్వే నంబర్ 342లో ఉన్న తన భూమిని రీ సర్వే చేయడంతోపాటు, సబ్ డివిజన్ కూడా చేయాలని కోరుతూ ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చాడు. ఈ క్రమంలో నక్కనదొడ్డి తండాకు చేరుకున్న కలెక్టర్... క్షేత్రస్థాయిలో సర్వే నంబర్ 342లోని భూములను పరిశీలించారు. మునేనాయక్‌కు చెందిన భూమి వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతు ఇచ్చిన అర్జీ మేరకు సదరు భూమిని వెంటనే సబ్ డివిజన్ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ రమాదేవి, ఇతర సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

• ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి డిమాండ్



ఉరవకొండ: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా సామాజిక భద్రతా పింఛన్ల మంజూరుపై దృష్టి సారించడం లేదని, ఫలితంగా అర్హులైన లక్షలాది మంది నిరాశ నిస్పృహలతో జీవనం సాగిస్తున్నారని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త పింఛన్ కోసం ఎంతో మంది వితంతువులు, దివ్యాంగులు, డయాలసిస్ రోగులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అర్హులైన వీరికి పింఛన్ అందిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖలు రాసినట్లు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు ఇంటర్ విద్యార్థి



నాగవర్ధన్‌రెడ్డిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్ఐ

తాడిపత్రి టౌన్: ఇంటర్ ఫెయిల్ కావడంతో ఇంట్లో చెప్పకుండా వెళ్లిన విద్యార్థి ఆచూకీని 24 గంటల్లోపే గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. వివరాలు... తాడిపత్రి మండలం బొడాయిపల్లికి చెందిన పుల్లారెడ్డి కుమారుడు నాగవర్ధన్‌రెడ్డి తాడిపత్రి లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 12న ఫలితాలు వెలువడడంతో తన ఉత్తీర్ణతను తెలుసుకునేందుకు తాడిపత్రికి వచ్చిన నాగవర్ధన్‌రెడ్డి ఫెయిల్ అయినట్లుగా నిర్ధారించుకుని ఎటో వెళ్లిపోయాడు. రోజు గడిచినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు తెలిసిన వారి వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఫెయిల్ అయిన కుమారుడు ఏ అఘాయిత్యం చేసుకున్నాడోనని కన్నీరుమున్నీరవుతూ ఈ నెల 14న తండ్రి తాడిపత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తిరుపతిలో ఉన్న నాగవర్ధన్‌రెడ్డిని అక్కడి పోలీసుల సాయంతో గుర్తించి మంగళవారం రాత్రి తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. బుధవారం తాడిపత్రి పీఎస్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ అనంతరం తండ్రి పుల్లారెడ్డికి అప్పగించారు. సకాలంలో స్పందించి తమ కుమారుడిని సురక్షితంగా అప్పగించేలా చొరవ చూపిన ఎస్ఐ గౌస్‌బాషాకు పుల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అంతర జిల్లా చైన్‌స్నాచర్ల అరెస్ట్

• రూ.32.40 లక్షల విలువ చేసే 36 తులాల బంగారం, నగదు, మూడు బైక్‌ల స్వాధీనం
• వ్యసనాలతో అప్పులపాలై చైన్‌స్నాచర్లుగా మారిన యువకులు



స్వాధీనం చేసుకున్న సొత్తును చూపుతున్న ఎస్పీ జగదీష్, పోలీసు అధికారులు

అనంతపురం: ఒంటరిగా వెళ్లే మహిళల్ని టార్గెట్ చేసి వారి మెడలోని బంగారు గొలుసులను లాక్కొని ఉడాయించే అంతర జిల్లా చైన్‌స్నాచర్ల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి మొత్తం రూ.32.40 లక్షల విలువ చేసే 36 తులాల బంగారం, నగదు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో అనంతపురం శివారులోని రాజీవ్ కాలనీకి చెందిన కె.పంపాచారి అలియాస్ నరేష్, రాయల్ నగర్‌కు చెందిన షేక్ షాకీర్, ప్రియాంకనగర్ నివాసి షేక్ ఫజిల్ అహమ్మద్ అలియాస్ షేక్ ఫజీజ్ అహమ్మద్, శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ నివాసి కంబం నాగార్జున అలియాస్ చిన్నా ఉన్నారు. బుధవారం డీపీఓలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఎస్పీ పి.జగదీష్ వెల్లడించారు.

అందరూ 24 నుంచి 30 ఏళ్ల లోపు వారే

పట్టుబడిన నిందితులందరూ 24 నుంచి 30 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం. కె.పంపాచారి కార్పెంట్ వృత్తితో పాటు డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి సంపాదన మొత్తం వ్యసనాలకే ఖర్చు పెట్టేవాడు. ఇతనికి నాలుగు నెలల క్రితం కంబం నాగార్జున పరిచయమయ్యాడు. నాగార్జున సొంతూరు శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ కాగా, ఏడాదిన్నర క్రితం కుటుంబంతో సహా అనంతపురానికి వలస వచ్చి సుఖ్‌దేవ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పంపాచారి పరిచయమైన తర్వాత ఇద్దరూ కలసి పేకాట, ఆన్‌లైన్ జూదం ఆడుతూ సంపాదన మొత్తం పోగొట్టుకుని అప్పుల పాలయ్యారు. రాయల్ నగర్‌కు చెందిన షేక్ షాకీర్... కార్పెంటర్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో సొంతంగా ఓ ఫర్నీచర్ షాప్ ఏర్పాటు చేసుకుని అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కోసం అన్వేషిస్తుండగా పంపాచారి, నాగార్జున పరిచయమయ్యారు. ముగ్గురు కలసి వ్యక్తిగత అవసరాలకు, అప్పులు తీర్చేందుకు చైన్‌స్నాచింగ్‌లకు సిద్ధమయ్యారు. అనంతరం వీరందరూ కలసి బృందాలుగా విడిపోయి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడేవారు. ప్రైవేట్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్న షేక్ ఫజిల్ అహమ్మద్ సైతం ఆన్‌లైన్ బెట్టింగ్, పేకాట తదితర వ్యసనాలకు బానిసై అప్పుల పాలయ్యాడు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో పాటు ఇటీవల పెళ్లి సంబంధం కూడా ఖాయమైంది. పెళ్లి ఖర్చులకు డబ్బు లేకపోవడంతో చైన్‌స్నాచర్‌గా మారాడు.


ఒంటరిగా వెళ్లే మహిళలే లక్ష్యంగా..

పంపాచారి ద్విచక్ర వాహనంపై ఒక్కడే వెళుతూ శివారు కాలనీలు, నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలోని బంగారు నగలను లాక్కొని అదే టూవీలర్‌పై ఉడాయించేవాడు. 2023 నుంచి కురుగుంట, మన్నీల, రాప్తాడు, అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డు, గణేష్ నగర్, లలితానగర్, ఒకటో రోడ్డు, తదితర ప్రాంతాల్లో 10 చైన్ స్నాచింగ్‌లు చేశాడు. అనంతరం షేక్ షాకీర్‌తో కలసి బైక్‌పై వెళుతూ కళ్యాణదుర్గం రోడ్డు, ద్వారకా విల్లాస్‌లో రెండు స్నాచింగ్‌లు, కంబం నాగార్జునతో కలసి హెచ్చెల్సీ రోడ్డు, స్టాలిన్ నగర్, బుక్కరాయసముద్రం, బి.కొత్తపల్లి గ్రామాల్లో నాలుగు స్నాచింగ్‌లు చేశాడు. మొత్తం 16 కేసుల్లో పంపాచారి నిందితుడు. ఇందులో రెండు కేసుల్లో షేక్ షాకీర్, నాలుగు కేసుల్లో కంబం నాగార్జున నిందితులుగా ఉన్నారు. షేక్ ఫజిల్ అహమ్మద్ ఎవరూ గుర్తుపట్టకుండా తలకు ఎరుపు రంగు క్యాప్ పెట్టుకుని, ముఖానికి ఖర్చీఫ్ కట్టుకుని చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడేవాడు. అనంతపురంలోని శ్రీశ్రీ నగర్, హెచ్చెల్సీపై సచివాలయ మహిళా ఉద్యోగిని మెడలో ఉన్న బంగారు చైన్ అపహరణ, ఇతర మూడు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. నిందితులు నలుగురూ వేర్వేరుగా పట్టుబడ్డారు. చైన్ స్నాచర్ల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐలు ఎస్.శేఖర్, కె.సాయినాథ్, ఇస్మాయిల్, జయపాల్‌రెడ్డి తదితరులను ఎస్పీ అభినందించారు.

వృద్ధురాలిని ఏమార్చి చైన్ స్నాచింగ్

గార్లదిన్నె: వృద్ధురాలిని ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసును దుండగుడు అపహరించుకెళ్లాడు. పోలీసులు తెలిపిన మేరకు గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లికి చెందిన వృద్ధురాలు నీలావతి బుధవారం మండల కేంద్రంలో కిరాణా సరుకులు కొనుగోలు చేసి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైంది. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై గుడ్డాలపల్లి క్రాస్ వద్ద ఆటో కోసం వేచి ఉన్న సమయంలో తలకు హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడు వృద్ధురాలి పక్కనే వాహనాన్ని ఆపి తాను కూడా గుడ్డాలపల్లికి వెళుతున్నట్లు నమ్మబలికి ఆమెను ఎక్కించుకుని ముందుకు కదిలాడు. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే వాహనాన్ని ఆపి తనకు ఫోన్‌కాల్ రావడంతో వెనక్కి వెళ్లాల్సి ఉందని తెలపడంతో వృద్ధురాలు కిందకు దిగింది. ఆ సమయంలో ఆమె మెడలోని 5 తులాల బంగారు చైన్‌ను లాక్కొని ద్విచక్ర వాహనంపై వేగంగా జాతీయ రహదారి వైపుగా ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

పాఠశాలలో ఆకతాయిల విధ్వంసం



ఆకతాయిలు ధ్వంసం చేసిన స్విచ్ బోర్డు

ఉరవకొండ: స్థానిక 8వ వార్డు పాతపేటలోని మండల పరిషత్ ప్రాథమిక సెంట్రల్ పాఠశాలలో ఆకతాయిలు, తాగుబోతులు మంగళవారం రాత్రి విధ్వంసానికి పాల్పడ్డారు. తొలుత పాఠశాల గ్రౌండ్ ఫ్లోర్‌లోని వరండా ఇనుప గ్రిల్ తలుపును విరగొట్టి లోపలికి ప్రవేశించారు. తరగతి గదిలోని రెండు సీలింగ్ ఫ్యాన్లు తొలగించి పక్కన పడేశారు. అనంతరం విద్యుత్ స్విచ్ బోర్డుతో పాటు నీటి మోటార్‌కు చెందిన స్టార్టర్ బోర్డును పగులగొట్టారు. ఫ్లోరింగ్ టైల్స్ బండరాళ్లతో ధ్వంసం చేశారు. తరగతి గదిలోనే మద్యం తాగి అక్కడే సీసాలు పగులగొట్టి, మూత్ర విసర్జన చేశారు. బుధవారం ఉదయం పాఠశాలకు చేరుకున్న ఉపాధ్యాయులు అక్కడి విధ్వంసాన్ని గుర్తించి ఎంఈఓ ఈశ్వరప్ప దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో ఎంఈఓ పరిశీలించిన అనంతరం హెచ్‌ఎం నసీరాబేగంతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

• డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. డొకాయ్ ఆపరేషన్లు చేపట్టి లింగ నిర్ధారణ స్కానింగ్‌లకు పాల్పడుతున్న సెంటర్లపై చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు. అలాగే లింగ నిర్ధారణ చట్టం ఉల్లంఘనకు ఎలాంటి శిక్షలు ఉంటాయనే అంశంపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ యుగంధర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవికుమార్, గైనకాలజిస్టు డాక్టర్ రేణుక, పెథాలజిస్టు డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.

64 గ్రామాల్లో రక్తపూతలు సేకరించాలి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో దోమకాటు వ్యాధులు అధికంగా నమోదవుతున్న 32 మండలాల్లోని 64 గ్రామాల్లో ఫైలేరియా వ్యాధిని గుర్తించేందుకు రక్తపూతల సర్వే చేపట్టాలని సంబంధిత అధికారులను డీఐఓ ఓబులు ఆదేశించారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఈ నెల 25న ప్రపంచ మలేరియా దినంలో భాగంగా ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో సహాయ మలేరియా సబ్ యూనిట్ అధికారులు మద్దయ్య, మునాఫ్, బత్తుల కోదండరామిరెడ్డి, తిరుపాల్, నాగేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● తప్పతాగి... హల్‌చల్ చేసి



కూటమి పాలనలో తాగుబోతుల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. బుధవారం రాత్రి అనంతపురంలోని రైల్వే స్టేషన్ కూడలిలో ఓ యువకుడు మద్యం మత్తులో నడిరోడ్డుపై హంగామా సృష్టించాడు. ఒంటిపై చొక్కా విప్పేసి దర్జాగా రోడ్డుపై పడుకుని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించాడు. రాష్ట్రంలో సంపద సృష్టి అంటే యువకులను మద్యానికి బానిసలను చేయడం కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం మత్తు వదిలి మద్యం విక్రయాలను కట్టడి చేయాలని ఈ సందర్భంగా అటుగా వెళుతున్న వారు వ్యాఖ్యానించడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ముగ్గురిపై కేసు నమోదు

యాడికి: ఈ నెల 13న యాడికి మండలం రాయలచెరువులోని అరటి తోటలో స్వాధీనం చేసుకున్న 8.5 టన్నుల రేషన్ బియ్యం అంశానికి సంబంధించి పౌరసరఫరాల శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సుంకన్న, బాబు అనే ఇద్దరు వ్యక్తులు 8.5టన్నుల రేషన్ బియ్యాన్ని నరసింహులుకు చెందిన తోటలో డంప్ చేసినట్లుగా నిర్ధారణ అయింది. దీంతో సీఎస్‌డీటీ సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుంకన్న, బాబు, నరసింహులుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ధర్మవరం రూరల్: మండలంలోని రేగాటిపల్లి పొలాల్లో గత నెల 16న దారుణ హత్యకు గురైన చిత్రా అక్కమ్మ (57) కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను బుధవారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మవరం రూరల్ పీఎస్ సీఐ ఎస్.ప్రభాకర్ వెల్లడించారు. రావులచెరువు గ్రామానికి చెందిన చిత్రా అక్కమ్మకు 30 సంవత్సరాల క్రితం మేడాపురం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. దాదాపు 27 ఏళ్ల క్రితం అక్కమ్మ తన భర్త, పిల్లలను వదిలేసి ధర్మవరంలోని తిక్కస్వామి నగర్‌లో అద్దె ఇంటికి మకాం మార్చింది. ఈ క్రమంలో బతుకు తెరువు కోసం కళాజ్యోతి సర్కిల్‌లో వ్యభిచారం సాగిస్తుండేది. గత నెల 16న సాయంత్రం కళాజ్యోతి సర్కిల్‌లో విటుల కోసం వేచి ఉన్న ఆమెను స్థానిక శాంతినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కట్టుబడి షెక్షావలి, టీచర్స్ కాలనీలోని చౌడమ్మ గుడి వద్ద నివాసముంటున్న తలారి లోకేంద్ర ఆటోలో ఎక్కించుకుని రేగాటిపల్లి పొలాల్లోకి తీసుకెళ్లారు. అక్కడ అక్కమ్మతో లోకేంద్ర లైంగిక కోరిక తీర్చుకుంటున్న సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో షెక్షావలి సాయంతో అక్కమ్మ తలపై లోకేంద్ర రాయితో కొట్టి గాయపరిచాడు. అనంతరం తన వద్ద ఉన్న కత్తితో ఆమె గొంతు కోసి హతమార్చాడు. మృతదేహాన్ని ఎవరూ గుర్తు పట్టకుండా ఉండేందుకు కత్తితో ముఖంపై ఉన్న చర్మాన్ని తొలగించి అక్కడ నుంచి ఉడాయించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ హేమంత్‌కుమార్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టి పక్కా ఆధారాలతో నిందితులను గుర్తించారు. బుధవారం ఉదయం సీతారంపల్లి వద్ద జాతీయ రహదారిపై తచ్చాడుతున్న షెక్షావలి, లోకేంద్రను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ ఎస్.ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు బాబ్జాన్, రాజప్ప, షాకీర్, అనిల్‌కుమార్, రాఘవేంద్ర, బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ చత్రూనాయక్, రామాంజినేయులను ఎస్పీ రత్న, డీఎస్పీ హేమంత్‌కుమార్ అభినందించారు.

మద్యం మత్తులో గొడవ

• ఇటుకతో బాదడంతో వ్యక్తి మృతి



మృతిచెందిన సుబ్బరాయప్ప

హిందూపురం: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు గొడవపడ్డారు. ఓ వ్యక్తి సహనం కోల్పోయి ఇటుక పెళ్లతో బాదడంతో సుబ్బరాయప్ప(65) అనే వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన హిందూపురం మండలం గోళాపురం గుడ్డంపల్లిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గోళాపురం గుడ్డంపల్లి కర్ణాటక సరిహద్దున ఉండటంతో పాటు గ్రామంలో బెల్టుషాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే బంధువులైన సుబ్బరాయప్ప, నంజేగౌడ మంగళవారం పూటుగా మద్యం సేవించారు. ఒకచోట కూర్చొని మాట్లాడుకుంటున్న సమయంలో కుటుంబ విషయాలు ప్రస్తావనకు రావడంతో పరస్పరం వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో సహనం కోల్పోయిన నంజేగౌడ ఇటుక పెళ్లతో సుబ్బరాయప్ప తలపై బలంగా కొట్టాడు. తీవ్ర గాయమైంది. బంధువులు హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా మారడంతో రాత్రి మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు.


ఆరంభ శూరత్వం

• ప్రహసనంలా మారిన జీజీహెచ్‌లోని మదర్ మిల్క్ బ్యాంక్
• మంత్రి సత్యకుమార్ ప్రారంభించి పది రోజులు
• నేటికీ ఆచరణకు నోచుకోని వైనం

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వానికి డైవర్షన్ పాలిటిక్స్ బాగా అబ్బొచ్చినట్లున్నాయి. రోగులకందించే సేవల్లో నాణ్యత పెంచుతున్నట్లు.. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందంటూ ప్రచారం చేసుకొచ్చే ప్రజాప్రతినిధులు ప్రజలను మభ్యపెట్టే పనులకు తెరలేపారు. ఇందుకు నిలువెత్తు నిదర్శనమే ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేసిన మదర్ మిల్క్ బ్యాంక్. ఈ నెల 7న సాక్షాత్తు మంత్రి సత్యకుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఆస్పత్రిలోని మదర్ మిల్క్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి తాడిపత్రి అర్జాస్ స్టీల్‌తో రూ.38 లక్షలు, మరో రూ.10 లక్షల ఎంపీ నిధులతో మదర్ మిల్క్ బ్యాంకును ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ సమయంలో లేని హంగామా సృష్టించి రోగులను ఇబ్బందులకు గురి చేశారు. ఇదెలా ఉన్నా.. కనీసం మదర్ మిల్క్ బ్యాంకు ఆచరణకు అయినా జరుగుతోందా అంటే అదీ లేదు.

పది రోజులుగా నిర్మానుష్యం...

పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా మారింది ప్రస్తుతం మదర్ మిల్క్ బ్యాంక్ పరిస్థితి. మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ప్రారంభమై పది రోజులవుతున్నా.. ఇంత వరకూ అక్కడ ఎలాంటి పనులు జరగలేదు. పైకి చూసేందుకు మాత్రం అక్కడ పనులు జరుగుతున్నట్లుగా మిషనరీ, ఫ్రీజర్లను ఆన్ చేసి ఉంచారు. దీంతో విద్యుత్ ఖర్చు అధికమవుతోంది. అలాగే ఆటోక్లేవ్ బిన్స్, సుంకు, తదితర సామగ్రి లేదు. బ్యాంక్ కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి సిబ్బందికి పూర్తి స్థాయిలో ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. తల్లి పాల ప్రాముఖ్యత, పాలు నిల్వ ఉంచి పిల్లలకు అందించే విషయంపై ప్రజలకు, తల్లులకు ఎలాంటి అవగాహన కల్పించలేదు. కేవలం ప్రజాప్రతినిధుల మెప్పు పొందేందుకు ఆస్పత్రి అధికారులు సైతం అత్యుత్సాహం ప్రదర్శించారు.



మదర్ మిల్క్ బ్యాంకులో నిల్వలు లేకపోయినా ఖాళీ ఫ్రీజర్లు, ఇతర పరికరాలను ఆన్ చేసి ఉంచిన దృశ్యం



తల్లుల నుంచి పాలను తీసే పరికరాలు

క్లుప్తంగా

ఆర్టీఐతో పారదర్శక సేవలు



ఆర్టీఐ యాక్ట్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్: పారదర్శకత, ప్రజాపాలనలో బాధ్యతాయుతమైన సేవలు అందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని ఉపరవాణా కమిషనర్ ఎం.వీర్రాజు పేర్కొన్నారు. బుధవారం రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీఓలో పని చేస్తున్న ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులకు ఆర్టీఐ యాక్ట్–2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కారక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆర్టీఐ కార్యకర్త హొన్నూరప్ప ఆర్టీఐ యాక్టులో ముఖ్యమైన అంశాలు, అధికారుల బాధ్యతలు, పారదర్శక సేవలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్ నాయుడు, ఎంవీఐలు శ్రీనివాసులు, విశ్వనాథ్‌రెడ్డి, శ్వేతబిందు, ఏఓ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే విగ్రహాన్ని పున:నిర్మించాలి



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని సంగమేష్ సర్కిల్‌లో రోడ్డు నిర్మాణంలో భాగంగా తొలిగించిన మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని పున:ప్రతిష్టించేలా చర్యలు తీసుకోవాలని రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్.రామచంద్ర, రిజర్వేషన్ పరిరక్షణ సంఘం యువత రాష్ట్ర అధ్యక్షుడు జీవీ ఉజ్వల్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. సంగమేష్ సర్కిల్‌లో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ సర్కిల్‌కు పూలే సర్కిల్‌గా నామకరణం చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రహదారికి మహాత్మా జ్యోతిరావు పూలే రహదారిగా పేరు పెట్టాలని కోరారు. స్పందించిన ఎంపీ.. సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వేసవిలో అప్రమత్తత అవసరం



విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: వేసవికాలంలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ మెడికల్ ఆఫీసర్ లాల్యానాయక్ సూచించారు. శ్రీ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి.ఉమాదేవి ఆధ్వర్యంలో నగరంలోని ప్రభాకర్‌జీ నగర పాలక ప్రాథమిక పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వేసవి సమయంలో విద్యార్థులు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ సూర్యనారాయణ, యోగా టీచరు మునిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో చిచ్చరపిడుగు



పతకాలను చూపుతున్న హీన ఫైజా

అనంతపురం సిటీ: అనంతపురానికి చెందిన ఆరేళ్ల చిన్నారి అద్భుతాలు సృష్టిస్తోంది. స్కేటింగ్‌లో తనదైన శైలిలో రాణిస్తూ అబ్బురపరుస్తోంది. స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పని చేసే ఉద్యోగి ఇర్ఫాన్ కుమార్తె హీనా ఫైజా స్కేటింగ్‌లో దూసుకెళ్తోంది. అనంతపురం లక్ష్మీ సినర్జీ స్కూల్‌లో చదువుతున్న చిన్నారి 2022లో ప్రాక్టీస్ మొదలుపెట్టి 2024లో జిల్లా స్థాయిలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించడంతో తన విజయపరంపర కొనసాగిస్తోంది. కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఒక బ్రాంచ్ ఒక సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంది. 2024లో గోవాలో జరిగిన నేషనల్ పోటీల్లోనూ బ్రాంజ్ మెడల్ సాధించడంతో పాటు గోల్డ్‌మెడల్ సాధించింది. తాజాగా 2025లో పంజాబ్ రాష్ట్రంలో జరిగిన పోటీల్లో సిల్వర్ మెడల్‌తో సత్తా చాటింది.

విస్తరణ పేరుతో కూల్చివేత

- రాప్తాడు పంచాయతీ ముస్లిం మైనార్టీ, ఆర్.ఆర్ కాలనీల్లో ఏకపక్షంగా ఇళ్ల కూల్చివేత
- రోడ్డు ఆక్రమణకు గురైందంటూ చెబుతున్న అధికారులు
- ఒక వైపే ఇళ్లను కూల్చుతున్న వైనం
- కన్నీరుమున్నీరవుతున్న బాధితులు
- అధికారుల తీరుపై ఆగ్రహం





ముస్లిం మైనార్టీ కాలనీలో ఇళ్లను ఒక వైపే తొలగించిన దృశ్యం

రాప్తాడు: రాప్తాడు పంచాయతీలోని ముస్లిం మైనార్టీ కాలనీ, ఆర్.ఆర్ కాలనీల్లో రోడ్డు విస్తరణ పేరుతో పేదల ఇళ్లను అధికారులు గత రెండు రోజులుగా తొలగిస్తున్నారు. కాలనీలో 30 అడుగుల రోడ్డు ఉండగా.. రికార్డుల్లో 56 అడుగుల రోడ్డు ఉందంటూ అధికారులు చెబుతున్నారు. కాలనీల్లో దశాబ్దాల క్రితం కట్టుకున్న ఇళ్లను కూల్చివేస్తుండటంతో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివారాల్లోకి వెళ్లితే.. రాప్తాడు పంచాయతీలోని ముస్లిం మైనార్టీ కాలనీలో సర్వే నెంబర్ 140–2, 3లో 150 మంది పేదలకు అప్పటి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి 2007లో ఇందిరమ్మ పథకంలో భాగంగా ఒక్కొక్కరికీ ఒకటిన్నర సెంటు చొప్పున దాదాపుగా 150 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. అప్పట్లో పేదలు ఇళ్లను నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. అప్పటి నుంచి కాలనీలో మెయిన్ రోడ్డుపై సీసీ రోడ్డు, డ్రైనేజీలను వేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాయకులు, అధికారులు తమ కాలనీలో మెయిన్ రోడ్డు (జేఎన్‌టీయూ రోడ్డు) సీసీ రోడ్డు వేయడానికి ఏకపక్షంగా రోడ్డు పనులు ప్రారంభించారు. కాలనీలో ఇప్పటికే 30 అడుగుల రోడ్డు ఉందని.. అయితే ఆ రోడ్డు కాదని రికార్డుల్లో 52 అడుగుల రోడ్డు ఉందని అధికారులు చెబుతుండటంతో మండిపడుతున్నారు. ఏకపక్షంగా రోడ్డుకు (దక్షిణం వైపు) ఒక వైపు మాత్రమే ఇళ్లను బలవంతంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత రెండు అడుగులు మాత్రమే తొలగిస్తామంటూ చెప్పిన అధికారులు.. దాదాపు 20 అడుగుల వరకూ ఇళ్లను తొలగించారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిర్దాక్షిణ్యంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి జేసీబీలతో ఇళ్లను తొలగించడంపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాధేయపడినా కనికరించని అధికారులు..

'మాకు కొంత సమయం ఇవ్వండి.. మీరు సూచించిన మేరకు స్థలాన్ని తొలగించుకుంటాం' అని కాలనీవాసులు అధికారులను ప్రాధేయపడినా కనికరించలేదు. ఒక వైపే కాకుండా అటువైపు కూడా రోడ్డుపై నిర్మించిన ఇళ్లను తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. 'తామేమీ చేయలేమని.. ఒక వైపు మాత్రమే రోడ్డు అక్రమణకు గురైందని.. అటువైపు ఎవరూ రోడ్డుపై ఇళ్లు నిర్మించుకోలేదు' అని అధికారులు తెలిపారు. అడ్డుపడే వారిని బలవంతంగా పక్కకు నెట్టి పేదల ఇళ్లను తొలగించారు. రోడ్డు వేయాలంటే ఒక వైపు నుంచి రావాలని లేదంటే మరో వైపు చివర నుంచి రావాలని పలువురు ప్రశ్నించారు. అలా కాకుండా కాలనీ మధ్యలో మాత్రమే 25 మంది పేదల ఇళ్లను ఎలా తొలగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు అన్యాయం జరుగుతోందని.. ఇటు వైపు రోడ్డు ఎంత తొలగిస్తున్నారో అటువైపు కూడా అంతే రోడ్డు తొలగించాలని కాలనీ వాసులు జేసీబీ పనులను అడ్డగించారు. కొలతలు కూడా వేయకుండా సర్పంచ్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఇష్టానుసారంగా ఒక పక్క 20 అడుగులు పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కాలనీవాసులు షామీర్, నరసింహులు, సాయికుమార్, ప్రసాద్, బలరామప్ప, రాజారెడ్డి, శివారెడ్డి, రమేష్, రమణ, రాజమ్మ, లక్ష్మీనారాయణమ్మ, గీతమ్మ, సంధ్యారాణి, పర్వీన్ తదితరులు తెలిపారు. న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాం..



అప్పులు తెచ్చి, బ్యాంకులో బంగారు నగలు తాకట్టు పెట్టి ఇంటిని నిర్మించుకున్నాం. వాటి అప్పులు కూడా ఇంకా తీరలేదు. మేము నిరుపేదలం. మాకు ఎలాంటి ఆస్తులు లేవు. ఎంతో కష్టపడి ఇంటిని నిర్మించుకున్నాం. అధికారులు రోడ్డుపై ఇంటిని నిర్మించారని మాకు చెప్పకుండా నిర్లక్ష్యంగా తొలగించారు. ఒక వైపు మాత్రమే ఇళ్లను కూల్చుతున్నారు. మరో పక్క ఇళ్లు రోడ్డుపై నిర్మించినా వాటిని అధికారులు తొలగించలేదు. ఇప్పుడు మళ్లీ ఇదే ఇంటిని మరమ్మతు చేసుకోవాలంటే రూ.5 లక్షలు ఖర్చు అవుతాయి.

– షామీర్, ముస్లిం మైనార్టీ కాలనీ

న్యాయం చేయాలి



మా కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు లేక గత 18 ఏళ్లగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం రోడ్డు, డ్రైనేజీలు వేస్తామంటే చాలా సంతోషించాం. ఇప్పటికే మూడు సార్లు డ్రైనేజీ కాలువలు వేస్తామని కాలువలు తవ్వారు. కాలువలు తవ్వి ఐదు నెలలు అవుతున్నా వాటిని వేయలేదు. ఇంట్లో చిన్న పిల్లలు కాలువలో పడతారనే ఉద్దేశంతో మేమే కాలువలను పూడ్చి వేశాం. ప్రస్తుతం సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువలు వేస్తామని ఇళ్లను ఒక వైపే (దాదాపుగా 20 అడుగులు) తొలగిస్తున్నారు. మరో పక్క ఒక ఇంచు కూడా తొలగించలేదు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

– లక్ష్మీ కాంతమ్మ, ముస్లిం మైనార్టీ కాలనీ

పిల్లల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



పౌష్టికాహారం ఆవశ్యకతను వివరిస్తున్న సీడీపీఓ ధనలక్ష్మి

అనంతపురం సెంట్రల్: నగరంలో బరమప్ప వీధి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విష్ణువర్ధిని మాట్లాడుతూ.. బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వాసుపత్రిలోని ఎన్ఆర్‌సీ ద్వారా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జయభారతి, మాధవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

అనంతపురం రూరల్: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీడీపీఓ ధనలక్ష్మి తెలిపారు. అనంతపురం రూరల్ –5 సెక్టార్ పరిధిలోని రాయల్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ జయశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలతో సమావేశమై.. పోషక విలువలు కల్గిన ఆహారాన్ని తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించడంతో పాటు పోషకాహారం అందించాలని సూచించారు. పోషణ లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ఎన్ఆర్‌సీకి రెఫర్ చేయాలని సిబ్బందికి సూచించారు. అక్కడ వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్సతో పాటు పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంగన్‌వాడీ కార్యకర్త సుజాత తదితరులు పాల్గొన్నారు.

గొప్ప మానవతావాది వీరేశలింగం పంతులు



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నాటి సమాజాన్ని పట్టి పీడించిన మూఢనమ్మకాల నిర్మూలనకు మొట్టమొదటిసారిగా కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని ఎస్కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. కందుకూరి వీరేశలింగం 177వ జయంతి సందర్భంగా జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో 'కందుకూరి వీరేశలింగం జీవితం–స్ఫూర్తి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కొంతమంది మహానుభావులను గుర్తు చేసుకుంటే వారు చెప్పిన మాటలు గుర్తుకొస్తాయన్నారు. ఆ రకంగా వీరేశలింగం పంతులు చెప్పిన చిరిగిన చొక్కా అయినా వేసుకో ఒక మంచి పుస్తకం కొనుక్కో అన్న మాట నాకు గుర్తుకు వచ్చిందన్నారు. శాస్త్రీయ దృక్పథం గురించి 150 ఏళ్ల క్రితమే కందుకూరి వీరేశలింగం ప్రచారం చేశారని గుర్తు చేశారు. నమ్మిన సిద్ధాంతాన్ని అమలు జరపడానికి తన ఆస్తి మొత్తాన్ని రాసిచ్చిన గొప్ప త్యాగశీలి వీరేశలింగం పంతులు అని కొనియాడారు. సమతా జిల్లా కన్వీనర్ డాక్టర్ పి.ప్రసూన మాట్లాడుతూ.. వీరేశలింగం పంతులు గొప్ప మానవతావాది అన్నారు. చాందసవాదం నిర్మూలించబడాలంటే బాలికలు చదువుకోవాలని చెప్పడమే కాక దాన్ని ఆచరణలో పెట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాంగే నాయక్, ప్రధానోపాధ్యాయురాలు రేణుక, జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ సాకే భాస్కర్, సీనియర్ నాయకులు రోగప్ప, నగర కమిటీ సభ్యులు రామిరెడ్డి, ముత్యాలు, ప్రసాద్ రెడ్డి, తిరుపాలు, ప్రసాద్, లక్ష్మీనారాయణ షాజహాన్, మారెన్న పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రాంగణంలో..

అనంతపురం కల్చరల్: కళ, కళాకారులకు మరణం లేదు. అజరామరమైన కళ శాశ్వతంగా రసజ్ఞులైన ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటుందని వక్తలు అన్నారు. సంఘ సంస్కర్త, వైజ్ఞానికుడు కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకుని తెలుగు వెలుగు సామాజిక సాహిత్య సంస్థ వారు బుధవారం స్థానిక విశాలాంధ్ర ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. సీనియర్ కవి టీవీరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కవి రియాజుద్దీన్, బుక్‌హౌస్ మాజీ మేనేజర్ చెట్ల ఈరన్న, రామలింగమయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు కందుకూరి వీరేశలింగం తెలుగు సాహిత్యానికి, సంఘ సంస్కరణకు చేసిన కృషిని కొనియాడారు. మహానటుడు బళ్లారి రాఘవ వర్ధంతి, ప్రఖ్యాత హాస్యనటుడు చార్లీచాప్లిన్ జయంతి కూడా ఇదే దినాన రావడం కాకతాళీయమన్నా. ప్రపంచ రంగస్థల దినోత్సవంగా కళాకారులు, సాహితీవేత్తలు ఘనంగా జరుపుకుంటారని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల వారిని నిత్యనూతనంగా చైతన్యవంతం చేస్తున్న పద్యాలు ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జయసుమన్, లక్ష్మీశ్యామ్, సుబ్బారాయుడు, ప్రవీణ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అనంతవాసులకు కందుకూరి పురస్కారాలు



పురస్కారం అందుకున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: అనంత నాటక రంగానికి విశేష కృషి చేస్తున్న రంగస్థల కళాకారులను కందుకూరి వీరేశలింగం పురస్కారాలకు ఎంపిక చేశారు. బుధవారం రాత్రి విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రంలో పురస్కారాలను ప్రదానం చేశారు. రాష్ట్రంలో అత్యధిక పురస్కారాలకు ఎంపికైన జిల్లా కళాకారులు సోమర లక్ష్మీనారాయణ, ఆదినారాయణరెడ్డి, జేకే రామాంజనేయులు, సురభి ఆనంద్, వాల్మీకి కుళ్లాయప్ప, రాజా కుళ్లాయప్ప, వరప్రసాద్, శివశంకర్, నరహరి, ఎర్రిస్వామి, రామగోపాల్, ఎస్.నారాయణ స్వామి తదితరులు మంత్రి దుర్గేష్, నాటక అకాడమీ చైర్మన్ గోపాల కృష్ణ చేతుల మీదుగా అవార్డులు, రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారు. జిల్లాకే చెందిన రాష్ట్రస్థాయి కమిటీ మెంబర్ గాజుల పద్మజ నేతృత్వంలో అనంతలో సాగుతున్న నాటక రంగ కృషిని ప్రశంసించారు. మరో సీనియర్ నటుడు సంగాల నారాయణ స్వామి వయసు రీత్యా రాకపోవడంతో వారికి పోస్ట్ ద్వారా ప్రశంసాపత్రం, పురస్కారాన్ని పంపిస్తామని నిర్వాహకులు వెల్లడించారు.

వృద్ధుడి అదృశ్యం

రాప్తాడురూరల్: వాకింగ్ కోసం వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాపంపేట శివారులోని ఓటీఆర్ కాలనీకి చెందిన నల్లపరెడ్డి మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వాకింగ్ కోసమని బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. రాత్రయినా ఇంటికి రాకపోయే సరికి కంగారు పడిన కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాల్లో వెతికారు. అయినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో బుధవారం కుమారుడు హరినాథరెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గుత్తి రోడ్డులోని యూనియన్ బ్యాంకు లోపల స్థలం లేక ఆధార్ అప్‌డేట్ కోసం బయట ఎదురుచూస్తున్న ప్రజలు



ఆధార్ కోసం చిన్నారిని తీసుకొచ్చిన దృశ్యం

ఆధార్.. బేజార్

ప్రభుత్వ పథకాల లబ్ది పొందేందుకు ఆధార్ కార్డు కీలకం. ఇటీవల రేషన్‌కార్డులోని సభ్యులందరూ ఈ–కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో వేలిముద్రలు పడని వారంతా ఆధార్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. నగరంలో కేవలం ఒకట్రెండు బ్యాంకులు, పోస్టాఫీసులో మాత్రమే ఆధార్ నమోదు, మార్పులు చేర్పులకు అవకాశం ఉండటంతో ప్రజలు ఎగబడుతున్నారు. ఎండల తీవ్రత పెరగడంతో చిన్నారులు, వృద్ధులు, మహిళల అవస్థలు వర్ణనాతీతం. ఆధార్ కేంద్రాల వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఆధార్ సెంటర్లు పెంచితే కాని సమస్య తగ్గుముఖం పట్టేలా కనిపించడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



సప్తగిరి సర్కిల్ సమీపంలోని యూనియన్ బ్యాంకు వద్ద అవస్థలు

హిమోఫీలియా బాధితులు జాగ్రత్తగా ఉండాలి

రాప్తాడురూరల్: హిమోఫీలియా బాధితులు జాగ్రత్తగా ఉండాలని హిమోఫీలియా బాధితుల సంఘ జిల్లా అధ్యక్షుడు మఠం శ్యామ్ సుందర్ శాస్త్రి సూచించారు. బుధవారం ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిమోఫీలియా వ్యాధిగ్రస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతుగా ఉంటున్నాయన్నారు. ఈ వ్యాధిని శాశ్వతంగా నయం చేయడానికి (జీన్ థెరపి) పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ఫలితాలు ఆశాజనకంగా ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. తొందరలోనే శాశ్వత పరిష్కారం దొరుకుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హిమోఫీలియా సంఘం సభ్యులు కృష్ణమూర్తి, గణేష్ పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ చేపట్టాలి



మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: ఇంటింటా చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని సాయి నగర్, విద్యుత్ నగర్, సప్తగిరి సర్కిల్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. చెత్త సేకరణకు పారిశుద్ధ్య సిబ్బంది వస్తున్నారా అని ఆరా తీయగా.. స్థానికులు సరిగా రావడం లేదని చెప్పారు. దీంతో అక్కడే ఉన్న ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తిపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వంద శాతం చెత్త సేకరణ చేపట్టేలా చూడాలన్నారు. నిర్లక్ష్యంగా ఉన్న పారిశుద్ధ్య కార్యదర్శుల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి, తరలించాలని పేర్కొన్నారు. నగర ప్రజలు సైతం చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని నగర పాలక సంస్థ వాహనాలకు అందించాలన్నారు.

సామాజిక పింఛన్ల తొలగింపు అన్యాయం



మాట్లాడుతున్న ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ

కనగానపల్లి: రాజకీయ దురుద్దేశంతో సామాజిక పింఛన్లు తొలగించడం అన్యాయమని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి నామమాత్రంగానే ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. తొలుత శాఖల వారిగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ భాగ్యమ్మ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతా పలు గ్రామాల్లో సామాజిక పింఛన్లను తొలగిస్తున్నారన్నారు. రాజకీయ దురుద్దేశంతో అర్హులైన వారి పింఛన్లు తొలగించి వృద్ధులు, వికలాంగులకు అన్యాయం చేయడం తగదన్నారు. దీనిపై అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వటం లేదని మండిపడ్డారు. దీనిపై టీడీపీకి పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు లేచి గత ప్రభుత్వంలో కూడా కొన్నిచోట్ల పింఛన్లు తొలగించారని ఎంపీపీకి అడ్డుతగిలారు. ప్రస్తుతం సర్వేల ఆధారంగా అధికారులు అనర్హులను గుర్తించి పింఛన్లు తీసేస్తున్నారన్నారు. ఇందులో ఎక్కడా రాజకీయ దురుద్దేశం లేదని వాదనకు దిగారు. దీంతో సమావేశంలో సభ్యుల మధ్య కొంతసేపు వాడీవేడి చర్చ జరిగింది. సమావేశంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్, రాప్తాడు మార్కెట్‌యార్డ్ చైర్మన్ సుధాకర్ నాయుడు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి

అనంతపురం కల్చరల్: చైత్రమాసంలో వచ్చిన సంకష్టహర చతుర్థి వేడుకలు ఘనంగా జరిగాయి. వినాయకుడికి ప్రీతిపాత్రమైన బుధవారం నాడు రావడంతో నగరంలోని పలు వినాయక ఆలయాల్లో సందడి నెలకొంది. మూడవ రోడ్డు బాబా మందిరం, గీతామందిరం, రజక నగర్‌లోని శ్రీసంకష్టహర వినాయక మందిరం, పాతూరు చెరువు కట్టపైన ప్రాచీన వరసిద్ధి వినాయన ఆలయం, రైల్వేస్టేషన్ సమీపంలోని బుద్ధి వినాయక స్వామి ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు చేపట్టారు. అలాగే స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలోని వినాయకుడికి కార్పొరేటర్ గురుశేఖరబాబు నేతృత్వంలో పూజలు జరిగాయి. అర్చకులు వ్రతకథలను చెబుతూ భక్తులతో ఆచరింపజేశారు. ఈ సందర్భంగా సహస్ర మోదకాలను స్వామికి నివేదించిన అనంతరం భక్తులకు వితరణ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.